క్లుప్తంగా

కూల్‌డ్రింక్ దుకాణంలో చోరీ

మరికల్: అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగలు కూల్‌డ్రింక్ దుకాణంలో చోరీకి పాల్పడిన సంఘటన లాల్‌కోట చౌరస్తాలో చోటు చేసుకుంది. మండలంలోని పెద్దచింతకుంట శివారు లాల్‌కోట చౌరస్తాలోని మణికంఠ కూల్‌డ్రింక్ దుకాణంలో బుధవారం అర్ధరాత్రి దుకాణం వెనుక భాగంలో రేకులను తొలగించిన షాపులో రూ.98 వేలు నగదుతో పాటు రెండు కాటన్ల కూల్‌డ్రింక్స్‌ను చోరీ చేసినట్లు యాజమాని వేణుగోపాల్ పోలీసులకు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ ఎల్లయ్య పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మాగనూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పార్ట్ టైం శిక్షకులు క్రాఫ్ట్, డ్రాయింగ్ పోస్టులకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు మాగనూర్ మండల ఇన్‌చార్జ్ ఎంఈఓ అనిల్‌గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు శనివారం వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అదే విధంగా మాగనూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నైట్ వాచ్‌మెన్ పోస్టు ఖాళీగా ఉందని, ఆసక్తి గల వారు తగిన సర్టిఫికెట్లతో మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వీటికి కూడా ఈ శనివారం వరకు అవకాశం ఉందని తెలిపారు. మరిన్ని వివరాలకు స్థానిక ఎంఈఓ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

కృష్ణా: మండలంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని కాంప్లెక్స్ హెచ్‌ఎం కిశోర్, సీఆర్పీ అమీన్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతో పాటు వంట గదులు, పాత్రలు పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. ఇందులో ఎస్‌ఓ శాలిని, ఉపాధ్యాయులు పద్మ తదితరులు ఉన్నారు.

పాఠశాలకు కంప్యూటర్, టీవీ వితరణ

మక్తల్: మండలంలోని ఉప్పర్‌పల్లికి చెందిన కీ.శే.తిప్పారెడ్డి, రామచంద్రారెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారులు శ్రీకాంత్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి పాఠశాలకు 60 విలువ గల కంప్యూటర్, టీవీ అందజేశారు. దాతలకు పాఠశాల హెచ్‌ఎం రవీందర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ శివమ్మ శాలువాతో సన్మానించారు. ఉపాధ్యాయులు పావని, జగదీశ్, దామోదర్‌రెడ్డి, లింగారెడ్డి, రవితేజ, గోవర్ధన్ పాల్గొన్నారు.

చిన్నారులకు వైద్య శిబిరం

మాగనూర్: మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మల్లికా పాలీ క్లినిక్ మహబూబ్‌నగర్ వారి ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ హాజరై మాట్లాడారు. మల్లికా పాలీ క్లినిక్ ఆధ్వర్యంలో గ్రామస్థాయిలో వైద్య శిబిరం ఏర్పాటు చేయడం మంచి విషయమన్నారు. ఇలాంటి వైద్య శిబిరాలను గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉపాధ్యాయులపై దాడులు తగదు

దామరగిద్ద: విద్యార్థులను మందలించారన్న నెపంతో బాదెపల్లి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడిపై దాడి చేయడం సరికాదని టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యదర్శి రెట్టప్ప అన్నారు. మండలంలోని క్యాతన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విరామ సమయంలో ఉపాధ్యాయులతో కలిసి నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఉపాధ్యాయులు వెంకటప్ప, సంతోష్ కుమార్, కన్నప్ప, కిష్టయ్య పాల్గొన్నారు.

మండల కమిటీలు ఎన్నిక

మరికల్: అఖిల భారత యాదవ మహాసభ మండల కమిటీలను గురువారం జిల్లా యాదవ సంఘం ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మరికల్ మండల యాదవ సంఘం అధ్యక్షుడిగా పెద్దచింతకుంట కృష్ణయ్య, యువజన విభాగం అధ్యక్షుడిగా చిత్తనూర్ మురళి, ఉపాధ్యక్షుడిగా రాజు, ప్రతాప్, ప్రధాన కార్యదర్శిగా వెంకట్రాములు, కార్యదర్శిగా రవికుమార్, కోశాధికారిగా నాగరాజ్‌ను ఎన్నుకున్నారు. యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా అంజియాదవ్, నరేష్, మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా రఘు, కార్యదర్శిగా బాలరాజ్, కోశాధికారిగా నవీన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షులు బాల్లప్ప తెలిపారు. కార్యక్రమంలో రాజేష్, హరిప్రసాద్, గొల్ల రాజు, కృష్ణయ్య, గోపాల్, వెంకట్రాములు, కేశవులు, రవికుమార్, నరహరి పాల్గొన్నారు.

ఎస్‌ఐను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

మరికల్: నూతన ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన రామును గురువారం రాకొండ కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం శాలువాతో ఘనంగా సన్మానించారు. రాకొండలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు నరహరి, రాజు, ఆనంద్ పాల్గొన్నారు.

సీఎం కప్ ఏర్పాట్లపై సమీక్ష


ధన్వాడ ఎంపీడీఓ కార్యాలయంలో మాట్లాడుతున్న అధికారులు

సాక్షి, నెట్‌వర్క్: సీఎం కప్ పోటీల నిర్వహణపై జిల్లా వ్యాప్తంగా ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పోటీల నిర్వహణ బాధ్యతలు చూసుకునేందుకు కమిటీలను నియమించామన్నారు. ఈ నెల 7, 8న గ్రామ స్థాయిలో, 10, 11,12 మండల స్థాయిలో, 16 నుంచి 21 వరకు జిల్లా స్థాయిలో, 27 నుంచి జనవరి 2 వరకు రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. 16 నుంచి 25 ఏళ్ల యువత ఈ పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు.

- నర్వ ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో అధికారులు సమావేశమై పోటీల నిర్వహణపై చర్చించారు.
- నారాయణపేటలో నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్ అమరేందర్ కృష్ణ, ఎంపీడీఓ సుదర్శన్, ఎంపీఓ బాలాజీ, పాఠశాల హెచ్‌ఎంలు, పీటీలు పాల్గొని ఏర్పాట్లపై సిబ్బందికి సూచనలు చేశారు.
- ధన్వాడ ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ధన్వాడ, కొండాపురం, కిష్టాపురం, గున్ముకల, గోటూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేశామని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాయిప్రకాష్, తహసీల్దార్ సింధూజ, ఎంఈఓ గాయత్రీదేవి, ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఏఎస్‌ఐలు పాల్గొన్నారు.
- మరికల్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కొండన్న, ఎస్‌ఐ రాము పోటీల నిర్వహణపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు.
- మాగనూర్ మండలంలో క్రీడా పోటీల ఏర్పాటుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఎంపీడీఓ రహ్మతుద్దీన్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ సురేష్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ పి. అశోక్‌బాబు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.
- కృష్ణా మండల కేంద్రంలో ఎంపీడీఓ జానయ్య ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శులు మహేష్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.


మాగనూర్‌లో..


మరికల్‌లో మాట్లాడుతున్న ఎంపీడీఓ కొండన్న


నారాయణపేటలో..

యువజన కాంగ్రెస్ అధ్యక్షులకు సన్మానం

మక్తల్: యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో గెలుపొందిన నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వేణుగౌడ్, మండల అధ్యక్షుడు వాకిటి భాస్కర్, ఊట్కూర్ మండల అధ్యక్షుడు మహేష్ ను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి శాలువాలతో సన్మానించారురు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గణేశ్‌కుమార్, యజ్ఞేశ్వర్‌రెడ్డి, రవికుమార్, వెంకటేశ్ తదతరులు పాల్గొన్నారు.

దామరగిద్ద: మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ముంగు శ్రీనివాస్ ముదిరాజ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ కుంభం శివకుమార్‌రెడ్డి, చిట్టెం అభిజయ్‌రెడ్డి ఆయనను అభినందించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఊట్కూరు: మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా విజయం సాధించిన సోరం మహేష్‌కుమార్‌రెడ్డిని నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు బాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి, నాయకులు కొక్కు లింగం, శంకర్, గోవిందప్ప, కృష్ణార్జున్‌రెడ్డి, భీమకవి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: మండల కేంద్రంకు చెందిన షేక్ సర్ఫరాజ్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు పార్టీ మండల అధ్యక్షుడు రాజప్పగౌడ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా సర్ఫరాజ్‌ను కాంగ్రెస్ నాయకులు సన్మానించారు.

నేడు బైక్ ర్యాలీ

నారాయణపేట రూరల్ : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో అమలుకు సాధ్యం కానీ హామీలిచ్చి అధికారంలోకి వచ్చి తుంగలో తొక్కిందని.. ఇచ్చిన హామీలను అమలు చేయాలని జిల్లా బీజేపీ అధ్యక్షుడు పి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 6న నిర్వహించనున్న బైక్ ర్యాలీలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నియోజకవర్గ స్థాయిలో మోటార్ బైక్ ర్యాలీ జరుగుతుందని తెలిపారు. బీజేపీ ఏడాది గడువిచ్చి ఇప్పుడు ఉద్యమబాట పట్టిందన్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు జిల్లా కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ, సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

వరి కొయ్యలు కాల్చొద్దు

కొత్తపల్లి: ప్రపంచ మృత్తికా దినోత్సవం సందర్భంగా లింగాల్ చేడ్ రైతు వేదికలో గురువారం కొత్తపల్లి వ్యవసాయ అధికారి రమేశ్‌నాయక్ రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నేలల సంరక్షణ, వివిధ పోషకాల గురించి వివరించారు. రైతులు పొలంలో మట్టి సేకరించి పరీక్షలు చేయించాలని సూచించారు. వరి కొయ్యలు కాల్చకుండా నేలలో కలియదున్నే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓలు నరేష్, మొహన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

బొడ్రాయి ఉత్సవాల్లో సీఎం సోదరుడు

కొత్తపల్లి: మండల పరిధిలోని అల్లీపూర్ గ్రామంలో (నాభిశిల)బొడ్రాయి స్థాపన ఉత్సవంలో గురువారం కొడంగల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి తిరుపతి రెడ్డి పాల్గొన్నారు. పోచమ్మ, బొడ్రాయి, నవగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. వేద మంత్రాలతో పూజారులు విగ్రహ స్థాపన చేశారు. అనంతరం గ్రామస్తులకు అన్నదానం నిర్వహించారు.అనంతరం గ్రామ శివారులో స్థాపించిన పోచమ్మకు మహిళలు బోనాలు నిర్వహించి మొక్కులు తీసుకున్నారు. తిరుపతి రెడ్డిని మాజీ సర్పంచ్ రమేశ్ రెడ్డి ఘనంగా న్మానించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ వార్ల విజయ్ కుమార్, కోస్గి మార్కెట్ కమిటీ చైర్మన్ ముద్ది బీములు, పీఏసీఎస్ అధ్యక్షుడు నర్సిములు, మాజీ జెడ్పీటీసీ రఘుపతి రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోట్ల మహేందర్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నరు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు..

కోస్గి: పట్టణంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వర, శివసాయి, అయ్యప్ప ఆలయాల్లో గురువారం కొడంగల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, ముఖ్యమంత్రి సోదరుడు తిరుపతిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తిరుపతిరెడ్డిని ఆలయ కమిటీ తరుపున సన్మానించారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.


అల్లీపూర్‌లో బొడ్రాయి స్థాపనలో సీఎం సోదరుడు తిరుపతి రెడ్డి

కంటి వైద్య శిబిరం

కోస్గి: జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ, లయన్స్ క్లబ్ కోస్గి శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో గురువారం నిర్వహించిన ఈ శిబిరంలో వైద్యుడు భాస్కర్‌గౌడ్ మొత్తం 50 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 20 మందికి కంటిలో శుక్లాలు గుర్తించారు. కంటి శుక్లాలు ఉన్న వారికి పాలమూర్ జిల్లా కేంద్రంలోని లయన్ రాంరెడ్డి కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేస్తామన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ పూర్ణచందర్ యాదవ్, ప్రతినిధులు వెన్న శేఖర్, వెంకట్రాములు పాల్గొన్నారు.

అడిషనల్ ఎస్పీకి అభినందనలు

నారాయణపేట: బెంగుళూరులో జరిగిన ఆల్ ఇండియా లాన్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా అడిషనల్ ఎస్పీ రియాజ్ సాధించిన విజయానికి పేట రెడ్‌క్రాస్ సొసైటీ టీమ్, మీడియా మిత్రులు పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో అడిషనల్ ఎస్పీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గోల్డ్ మెడల్ సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావడం గర్వకారణమని పేర్కొన్నారు.


అడిషనల్ ఎస్పీకి మొక్క అందజేస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

రేపు సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

నారాయణపేట రూరల్: పట్టణంలోని బాపునగర్ అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో శ్రీవల్లి దేవసేనా సమేత సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి, శాంతి కల్యాణ మహోత్సవం శనివారం నిర్వహించనున్నట్లు సామాల మాణిక్యప్ప, శ్రీనివాస్, అజయ్ తెలిపారు. ఈ సందర్భంగా గణపతి పూజ, పంచగవ్యప్రాశన, రక్షాబంధనం, మహాన్యాసపూర్వక అభిషేకం, సుబ్రహ్మణ్యస్వామి వారి బిల్వపత్రి పూజ రుద్రాహోమం, అనంతరం శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం, అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన

నారాయణపేట రూరల్ : ప్రభుత్వ సంక్షేమ పథకాలపై తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. మండలంలోని కొల్లంపల్లి, పేరపల్ల, కోటకొండ గ్రామాల్లో పర్యటించి డీపీఆర్‌ఓ రషీద్ ఆధ్వర్యంలో ప్రజలను చైతన్య పరిచారు. ఆరు గ్యారంటీల అమలు, అభివృద్ధి కార్యక్రమాలపై పల్లె జానపదాలతో కళాకారులు అలరించారు. కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు రవిశంకర్, కిరణ్, నరసింహ, బాలయ్య, చల్లా లక్ష్మి, అరుణ, రాధా, జ్యోతి, సుగుణ, జహీర్ తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం

ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్

కోస్గి: పట్టణంలోని శాంతినికేతన్ పాఠశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్ వేడుక ఎంతగానో ఆకట్టుకుంది. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ వేడుకలో విద్యార్థులు 115 రకాల ఆహార పదార్థాలను ప్రదర్శిస్తూ స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ ఫుడ్ ఫెస్టివల్ వేడుకను సీఐ దస్రూనాయక్ ప్రారంభించి స్టాల్స్‌ను సందర్శించారు. విద్యార్థులు తాము ప్రదర్శించిన ఆహార పదార్థాల తయారీ, వినియోగంతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గజానంద్, హెచ్‌ఎం శేఖర్‌గౌడ్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక



కోస్గి రూరల్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని లావణ్య రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ స్వప్న తెలిపారు. ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ఉమ్మడి పాలమూర్ జిల్లా నుంచి ప్రతిభ చూపింది. ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో జాతీయస్థాయిలో నిర్వహించే పోటీల్లో లావణ్య పాల్గొంటారని తెలిపారు.

జనాభా విద్యపై అవగాహన ఉండాలి

నారాయణపేట రూరల్ : మండలంలోని జాజాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్సీఈఆర్టీ ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. స్టేట్ రిసోర్స్ పర్సన్ మధుసూదన్ రావు హాజరై పాఠశాలలోని 9, 10వ తరగతి విద్యార్థులతో భావోద్వేగ మేధస్సుకు సంబంధించిన 40 అంశాలపై ప్రశ్నావళిని అందించి సమాధానాలు సేకరించారు. జనాభా విద్యపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం భారతి, డీఎస్‌ఓ భాను ప్రకాష్ పాల్గొన్నారు.



పిడుగుపాటుతో గేదె మృతి

కొత్తపల్లి: మండల పరిధిలోని భూనీడు గ్రామ శివారులో పిడుగు పడి గేదె మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. గురువారం మధ్యాహ్నం ఉరుములతో కూడిన భారీ వర్షం కురవడంతో భూనీడు గ్రామంలో ఆనెం వెంకటయ్యకు చెందిన గేదె అక్కడికక్కడే మృతి చెందింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

బోర్డు మాయం..పట్టని అధికారులు

ధన్వాడ: గ్రామ కఠం భూమి ఇదని ఏర్పాటు చేసిన బోర్డు మాయమైంది. మండల కేంద్రంలోని కంసాన్‌పల్లి రోడ్డులోని మారుతీనగర్ కాలనీ వద్ద కొద్ది రోజుల క్రితం నూతన వెంచర్ ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ భూమి అని గతంలో ఏర్పాటు చేసిన బోర్డు కనిపించడం లేదు. కొంత మంది అధికార పార్టీ నాయకులతో ములాకత్ అయి బోర్డులు తొలగించిన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. వెంచర్‌లో ఎన్‌టీఆర్ కాలనీ వైపు ఉన్న ప్రభుత్వ భూమిలో ఇప్పటికే నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. వీటిపై పంచాయతీ అధికారులకు సమాచారం అందించిన పట్టించుకోవడం లేదని గ్రామస్తులు తెలిపారు. ఈ విషయంపై గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రావును వివరణ కోరగా సర్వే బిజీగా ఉండి పరిశీలించలేదని బోర్డు తొలగించారా లేక కింద పడిపోయిందన్న విషయాన్ని పరిశీలిస్తామని తెలియజేశారు.


గ్రామ కఠం భూమిలో తొలగించిన బోర్డు

కార్మికులకు జీతాలు విడుదల చేయాలి

ధన్వాడ: పంచాయతీ కార్మికులకు గత ఐదు నెలల నుంచి వేతనాలు లేక అనేక ఇబ్బందులకు గురౌతున్నారని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్ అన్నారు. గురువారం మండలంలోని చర్లపల్లి గ్రామంలో కార్మికులతో కలిసి పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. జిల్లాలోని చాలా గ్రామాల్లో పంచాయతీ కార్మికులు జీతాల్లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికులకు జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.


చర్లపల్లి పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

అంతిమయాత్రకు తప్పని తిప్పలు

మరికల్: మదినిండా భారం మోస్తూ మరో వైపు వాగు దాటితేనే స్మశానవాటికకు వెళ్లి అంత్యక్రియలు పూర్తి చేయాల్సిన పరిస్థితి మరికల్ వాసులకు ఏర్పడింది. మరికల్‌లో గురువారం ఓ వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. స్మశాన వాటికకు వెళ్లడానికి మార్గమధ్యలో వాగు అడ్డురావడంతో నీటిలోనే ఇబ్బందులు పడుతూ అంతిమ యాత్ర కొనసాగించారు. వాగుపై కల్వర్టు నిర్మించాలని పలుమార్లు ప్రజాప్రతినిధులను, అధికారులను కోరిన తమ గోడు ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు పేర్కొన్నారు.


వాగు నీటిలో తీసుకెళ్తున్న అంతిమ యాత్ర

జీవుల మనుగడలో నేల పాత్ర కీలకం

కోస్గి రూరల్: జీవుల మనుగడలో నేల పాత్ర ఎంతో కీలకమని మీర్జాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం వెంకట్రాంరెడ్డి, సైన్స్ ఉపాధ్యాయుడు మల్లేశం అన్నారు. ఈ మేరకు ప్రపంచ నేల సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం పాఠశాలలో నేల కాలుష్యంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

మట్టి పరీక్షలు..

ప్రపంచ మృత్తిక దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతుల పొలాల్లో మట్టి పరీక్షలు నిర్వహించారు. మండల పరిధిలోని ముక్తిపాడ్‌లో మండల వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ, ఏఈఓ వినోద్ పలువురి రైతుల పొలాల్లో మట్టి పరీక్షలు నిర్వహించి భూములు సారవంతాన్ని వివరించారు.


మీర్జాపూర్ పాఠశాలలో మట్టి రకాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పాఠశాలలో మందుబాబుల వీరంగం

మాగనూర్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ భవనాలు ఆకతాయిలకు అడ్డాలుగా మారాయి. గురువారం మండలంలోని తళంకేరి ప్రాథమిక పాఠశాలలోని తరగతి గదులతో పాటు పాఠశాలపైన కూడా మందుబాబులు నిత్యం వీరంగం సృష్టిస్తున్నారు. నిత్యం తరగతి గదులు, పై భాగంలో మద్యం తాగి, బిర్యానీ తిని, తాగిన బీరు సీసాలు పాఠశాలలోని తరగతి గదిలోనే పగలగొడుతున్నారు. ఉదయాన్నే పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు ఈ దృశ్యం కనిపించడంతో వారు వెంటనే ఉపాధ్యాయులకు తెలియజేశారు. ఇలాంటి ఘటనల వలన టీచర్లతో పాటు విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. కొంతమంది తాగిన సీసాలను పడగలగొట్టడంతో విద్యార్థులకు గాయాలవుతున్నాయి. ఇలాంటి ఘటనలు నిత్యం జరుగుతున్నా అధికారులు స్పందిచడం లేదని గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా గ్రామ పెద్దలు, పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


పాఠశాల పై భాగంలో ఖాళీ బీరు సీసాలు

మాజీ మంత్రి హరీశ్‌రావు అరెస్టు అనైతికం

మక్తల్: తెలంగాణ ఉద్యమ నాయకుడు. మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అక్రమ అరెస్టులను ఖండిస్తున్నామని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు చిన్నహన్మంతు అన్నారు. గురువారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాన్ని గట్టిగా ప్రశ్నిస్తున్న నాయకులపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి మూల్యం తప్పదని హెచ్చరించారు. అసెంబ్లీ సమావేశాల్లో ఎక్కడ ఇబ్బంది చేస్తారనే భయంతోనే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో అన్వర్, జగ్గాలి రాములు, మొగులప్ప, జుట్ల శంకర్, అశోక్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి


కోస్గిలో ర్యాలీ చేస్తున్న దివ్యాంగులు

కోస్గి: ప్రపంచ దివ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మండలంలో దివ్యాంగులు ర్యాలీ నిర్వహించారు. కమిట్‌మెంట్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు మండల అధికారులు హాజరయ్యారు. స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీఓ శ్రీధర్ మాట్లాడుతూ సమాజంలో దివ్యాంగులను చిన్నచూపు చూడకుండా మనతో పాటు వారు కూడా మనుషులనే విషయాన్ని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీలు సందప్ప, నర్సిములు, దస్తయ్య, నారాయణమ్మ, సరిత, ఎంవీఎస్ సభ్యులు అనురాధ తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు: కమిట్‌మెంట్ సంస్థ, మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం పాతబస్టాండ్ చౌరస్తా వరకు దివ్యాంగుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దార్ మహేష్‌గౌడ్, ఎంపీడీఓ నర్సింహారెడ్డి, ఎంపీఎం నారాయణ మాట్లాడుతూ.. దివ్యాంగులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కమిట్‌మెంట్ కోఆర్డినేటర్ రాధమ్మ, ఆర్పీలు కిరణ్‌కుమార్, వెంకటయ్య పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు అవసరం

దామరగిద్ద: మానసిక ఉల్లాసం, శారీరక ధారుఢ్యానికి క్రీడలు ఎంతో అవసరమని సునందా మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యుడు ప్రసాద్ షెట్టి అన్నారు. గురువారం మండలంలోని క్యాతన్‌పల్లి గ్రామంలో కీర్తి శేషులు మెతుకు ఆంజనేయులు జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరై క్రీడలు ప్రారంభించారు. విజేతలకు రూ. 50 వేల నగదు, రన్నర్‌కు రూ. 30 వేలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నారాయణ, క్రీడాకారులు మోనేష్‌చారి పాల్గొన్నారు.